# మన ప్రజా ప్రతినిధి

ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దినపత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :265 సోమవారం జూలై 20 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH


## పార్లమెంట్ మార్చ్ విజయవంతం చేయండి సోనమ్ వాంగ్‌చుక్

- ఆస్పత్రి నుంచి మద్దతుదారులకు సందేశం
- అరెస్టుపై అభ్యంతరం వ్యక్తం
- ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు



న్యూఢిల్లీ, జూలై 19 (మనప్రజాప్రతినిధి): ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరాహార దీక్ష చేపట్టిన పర్యావరణవేత్త, ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ అరెస్టు అనంతరం సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి నుంచి తన మద్దతుదారులకు సందేశం పంపిన ఆయన, ఈ నెల 20న నిర్వహించనున్న పార్లమెంట్ మార్చ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై నిరసనలు కొనసాగుతున్న సమయంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనకు సంఘీభావంగా సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. 21 రోజుల పాటు దీక్ష కొనసాగించిన అనంతరం ఢిల్లీ పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. ఆస్పత్రి నుంచి విడుదల చేసిన సందేశంలో సీజేపీ చేపట్టిన ఉద్యమాన్ని రెండో స్వాతంత్ర్య ఉద్యమంగా అభివర్ణించిన వాంగ్‌చుక్, ప్రజలు పెద్ద సంఖ్యలో పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొనాలని కోరారు. భయం లేని, అసమానతలు లేని భారతదేశ నిర్మాణమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తన నిరాహార దీక్షను అడ్డుకుని అరెస్టు చేయడం అన్యాయమని ఆయన

2

## జాతీయ చలనచిత్ర పురస్కార విజేతలకు చంద్రబాబు అభినందనలు



- తెలుగు సినీ పరిశ్రమకు ప్రశంసలు
- కళా వారసత్వానికి సినిమా మూలస్తంభం
- మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష

అమరావతి, జూలై 19 (మనప్రజాప్రతినిధి): 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ద్వారా విడుదల చేసిన సందేశంలో అవార్డులు అందుకున్న కళాకారులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలుగు సినీ పరిశ్రమ సాధించిన విజయాలను కొనియాడారు. తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన

2

## తిరుమలలో వసతి గదుల కేటాయింపుకు కొత్త విధానం

- భక్తులకు నిరీక్షణకు చెక్
- ఉప విచారణ కార్యాలయాల ద్వారా గదులు
- డిజిటల్ విధానంతో వేగవంతమైన సేవలు



తిరుమల, జూలై 19 (మనప్రజాప్రతినిధి): శ్రీవారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులు వసతి గదుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన ఇబ్బందులకు తిరుమల తిరుపతి దేవస్థానం చెక్ పెట్టింది. ఆధునిక సాంకేతికతతో కూడిన కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చి, కేంద్రీయ విచారణ కార్యాలయం వద్ద నమోదైన భక్తులకు ఉప విచారణ కార్యాలయాల ద్వారా వేగంగా గదులు కేటాయించే విధానాన్ని ప్రారంభించింది. దీంతో భక్తుల సమయం, శ్రమ గణనీయంగా ఆదా కానుంది. వసతి గది కావాలనుకునే భక్తులు ముందుగా కేంద్రీయ విచారణ కార్యాలయంలో ఉదయం 5 గంటల నుంచి గదులు అందుబాటులో ఉన్నంత వరకు నమోదు చేసుకోవాలి. నమోదు సమయంలో ఒరిజినల్ ఆధార్ కార్డు లేదా దాని ప్రతితో పాటు

2

## అమెరికా చేరుకున్న మంత్రి సీతక్కకు ఘన స్వాగతం

- టీటీఏ మహాసభలకు హాజరు
- ఉత్తర కరోలినాలో స్వాగతం
- తెలంగాణ ఖ్యాతిని చాటుతున్న ప్రవాసులు



షార్లెట్, జూలై 19(మనప్రజాప్రతినిధి): టీటీఏ మహాసభల్లో పాల్గొనేందుకు అమెరికా చేరుకున్న రాష్ట్ర మంత్రి సీతక్కకు ఉత్తర కరోలినా రాష్ట్రంలోని షార్లెట్ విమానాశ్రయంలో టీటీఏ ప్రతినిధులు, ప్రవాస కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందించి ఆమెకు ఆత్మీయ స్వాగతం తెలిపారు. మంత్రి సీతక్కకు వాణి రెడ్డి, విశ్వ కంది, నరేందర్ రెడ్డి, రాహుల్, గణేష్‌తో పాటు టీటీఏ ప్రతినిధులు, ప్రవాస భారతీయులు స్వాగతం పలికారు. అమెరికాలో తెలంగాణ ప్రజలు అందించిన ఆదరణకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ పేరును నిలబెడుతున్న ప్రవాస భారతీయుల సేవలు ప్రశంసనీయమని సీతక్క అన్నారు. తమ ప్రతిభ, కృషితో విదేశాల్లో గుర్తింపు తెచ్చుకుంటూనే స్వరాష్ట్రంతో అనుబంధాన్ని



2

## అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోవద్దు మహేష్ కుమార్ గౌడ్

- ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి
- నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్న టీపీసీసీ అధ్యక్షుడు
- ఆగస్టు 3 వరకు పూర్తిస్థాయిలో పనిచేయాలని సూచన

హైదరాబాద్, జూలై 19 (మనప్రజాప్రతినిధి): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ అత్యంత కీలకమైందని, అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోకుండా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన జూమ్ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి




## జువ్వాడి చొక్కారావు ఆశయాలే స్ఫూర్తి మంత్రి పొన్నం ప్రభాకర్

- జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి
- పారదర్శక రాజకీయాలకు మారుపేరుగా జువ్వాడి చొక్కారావు
- వారి ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తాం
- ప్రజాసేవతోనే వారికి నిజమైన నివాళి

కరీంనగర్, జూలై 19 (మనప్రజాప్రతినిధి): దివంగత నేత, మాజీ మంత్రి, కరీంనగర్ మాజీ ఎంపీ జువ్వాడి చొక్కారావు జయంతి సందర్భంగా కరీంనగర్‌లోని వారి విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని చొక్కారావు సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జువ్వాడి చొక్కారావు రాజకీయాల్లో పారదర్శకత, నిబద్ధత, నిజాయితీకి ప్రతీకగా నిలిచారని అన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జీవితాంతం



## మూడు దేశాల పర్యటనకు రాష్ట్రపతి



- మోల్డోవా, ఉత్తర మాసిడోనియాకు తొలి పర్యటన
- మూడు దశాబ్దాల తర్వాత రొమేనియా సందర్శన
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యం

న్యూఢిల్లీ, జూలై 19 (మనప్రజాప్రతినిధి): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మూడు యూరప్ దేశాల అధికారిక పర్యటనకు బయలుదేరారు. మోల్డోవా, ఉత్తర మాసిడోనియా, రొమేనియా దేశాల్లో ఆమె పర్యటించనున్నారు. ఈ పర్యటనల ద్వారా ఆయా దేశాలతో భారతదేశం ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారత రాష్ట్రపతి హోదాలో మోల్డోవా, ఉత్తర మాసిడోనియా దేశాలను సందర్శించడం ఇదే తొలిసారి. ఈ చారిత్రాత్మక పర్యటనతో రాజకీయ, ఆర్థిక, వాణిజ్య, సాంస్కృతిక రంగాల్లో పరస్పర సహకారానికి కొత్త అవకాశాలు

2

## ఆస్ట్రేలియాలో భారత వైమానిక దళం విన్యాసాలు


- నేటి నుంచి పిచ్ బ్లాక్ విన్యాసాలు
- బహుళ దేశాల వైమానిక దళాల భాగస్వామ్యం
- రాత్రి యుద్ధ విన్యాసాలకు ప్రత్యేక ప్రాధాన్యం

న్యూఢిల్లీ, జూలై 19 (మనప్రజాప్రతినిధి): భారత వైమానిక దళం ఆస్ట్రేలియాలో నిర్వహించే ప్రతిష్ఠాత్మక బహుళ దేశాల వైమానిక యుద్ధ విన్యాసాల్లో పాల్గొననుంది. జూలై 20 నుంచి ఆగస్టు 7 వరకు ఆస్ట్రేలియాలోని డార్విన్ రాయల్ ఆస్ట్రేలియన్ వైమానిక దళ స్థావరంలో నిర్వహించే 'పిచ్ బ్లాక్2026' విన్యాసాల్లో భారత వైమానిక దళం తన సామర్థ్యాన్ని ప్రదర్శించనుంది. రెండేళ్లకోసారి నిర్వహించే ఈ విన్యాసాలు రాయల్ ఆస్ట్రేలియన్ వైమానిక దళం అత్యంత ప్రతిష్ఠాత్మక కార్యక్రమంగా గుర్తింపు పొందాయి. వివిధ దేశాలకు చెందిన వైమానిక దళాలు ఒకే వేదికపై కలిసి సంక్లిష్టమైన యుద్ధ పరిస్థితుల్లో సమన్వయంతో



# పార్లమెంట్ మార్చ్ విజయవంతం చేయండి సోనమ్ వాంగ్‌చుక్


మెదటి పేజీ తరువాయి




వ్యాఖ్యానించారు. అయితే సోమవారం నిర్వహించనున్న పార్లమెంట్ మార్చ్‌కు అనుమతి లేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. అయినప్పటికీ మార్చ్‌ను నిర్వహించి తీరుతామని సీజేపీ నాయకులు ప్రకటించారు. దీంతో రాజధానిలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి వైద్యులు స్పందించారు. దీర్ఘకాల నిరాహార దీక్ష కారణంగా శరీరానికి అవసరమైన ద్రవాలు అందిస్తున్నామని, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని వెల్లడించారు. మొదట్లో వైద్యం తీసుకోవడానికి సోనమ్ వాంగ్‌చుక్ నిరాకరించినట్లు వైద్యులు తెలిపారు. కౌన్సెలింగ్ నిర్వహించినప్పటికీ ఆయన అంగీకరించకపోవడంతో కుటుంబ సభ్యుల సహకారం కోరినట్లు వెల్లడించారు. మరోవైపు కోర్టు సూచనల మేరకే ఆయనను అరెస్టు చేసినట్లు ఢిల్లీ పోలీసులు స్పష్టం

# తిరుమలలో వసతి గదుల కేటాయింపుకు కొత్త విధానం

మెదటి పేజీ తరువాయి



మొబైల్ నంబర్ సమర్పించాలి. అనంతరం ముఖ గుర్తింపు విధానం ద్వారా వివరాలు నమోదు చేసి, అవసరమైన గది కేటగిరీని ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. రూ.50, రూ.100 అద్దె గల గదులు ఒక విభాగంలో, రూ.1000 అద్దె గల గదులు మరో విభాగంలో అందుబాటులో ఉంటాయి. నమోదు పూర్తయిన తర్వాత భక్తులకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తారు. అనంతరం కేంద్రీయ విచారణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిజిటల్ ప్రదర్శన బోర్డులపై నమోదు సంఖ్యల ఆధారంగా గది కేటాయింపు వివరాలు ప్రదర్శిస్తారు. నమోదు సంఖ్య ప్రదర్శించబడిన 15 నిమిషాల్లోపు భక్తుల మొబైల్ ఫోన్‌కు గది కేటాయించిన ఉప విచారణ కార్యాలయం వివరాలతో సందేశం పంపిస్తారు. సందేశం అందకపోయినా అక్కడ ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రంలో ధ్రువీకరణ పత్రాన్ని స్కాన్ చేసి గది వివరాలు తెలుసుకునే సౌకర్యం కల్పించారు. గది కేటాయించిన ఉప విచారణ కార్యాలయానికి వెళ్లిన తర్వాత భక్తులు గది అద్దెను తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలి. ఫోన్‌పే, గూగుల్ పే, యూపీఐ, క్రెడిట్ లేదా డెబిట్ కార్డుల ద్వారా చెల్లింపులు స్వీకరిస్తారు. నగదు చెల్లింపులకు అవకాశం ఉండదు. చెల్లింపు పూర్తయిన వెంటనే గది తాళాలను అందజేస్తారు. అంజనాద్రి నగర్, శేషాద్రి నగర్, శంఖుమిట్ట, గరుడాద్రి నగర్ కాటేజీలు, సప్తగిరి, వరాహస్వామి, కౌస్తుభం, పాంచజన్యం, నందకం తదితర విశ్రాంతి గృహాల ద్వారా ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. వసతి గదుల కేటాయింపుకు కొన్ని నిబంధనలను కూడా టీటీడీ అమలు చేస్తోంది. గది పొందే భక్తుడికి కనీసం 21 సంవత్సరాల వయస్సు ఉండాలి. ఒంటరి వ్యక్తులు, అవివాహితులకు గదులు కేటాయించరు. ఒకసారి గది పొందిన భక్తుడు తిరిగి 30 రోజుల వరకు మరో గదికి అర్హుడు కాదు. కుటుంబం తరఫున ఒక వ్యక్తి మాత్రమే నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. గదులను 24 గంటల కాలానికి మాత్రమే కేటాయిస్తారు. గడువు దాటితే అదనపు రుసుము విధిస్తారు. గదిని పొందిన భక్తుడే స్వయంగా ఖాళీ చేయాల్సి ఉంటుంది. కేటాయించిన గదిని ఇతరులకు బదిలీ చేయడం పూర్తిగా నిషేధమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ స్పష్టం చేసింది. కొత్త విధానం ద్వారా భక్తులకు మరింత పారదర్శకంగా, వేగవంతంగా వసతి సేవలు అందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

# జువ్వాడి చొక్కారావు ఆశయాలే స్ఫూర్తి మంత్రి పొన్నం ప్రభాకర్

మెదటి పేజీ తరువాయి



సేవలందించిన మహోన్నత నాయకుడిగా ఆయన చిరస్థాయిగా గుర్తుండిపోతారని పేర్కొన్నారు. జువ్వాడి చొక్కారావు చూపిన మార్గం, ప్రజల పట్ల ఉన్న అంకితభావం ఎంతో మంది ప్రజాప్రతినిధులకు స్ఫూర్తినిచ్చిందని మంత్రి తెలిపారు. వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని జిల్లా అభివృద్ధి, ప్రజాసేవ కోసం మరింత అంకితభావంతో పనిచేస్తామని చెప్పారు. ప్రజల విశ్వాసమే నాయకుడికి అతిపెద్ద బలం అనే సిద్ధాంతాన్ని జువ్వాడి చొక్కారావు తన రాజకీయ జీవితంలో ఆచరణలో చూపించారని మంత్రి పేర్కొన్నారు. విలువలతో కూడిన రాజకీయాలకు ఆయన జీవితం నిదర్శనమని కొనియాడారు. వారి ఆశయాల సాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. జువ్వాడి చొక్కారావు ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జయంతి సందర్భంగా జువ్వాడి చొక్కారావుకు మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి ఘన నివాళులర్పిస్తూ, వారు చూపిన ప్రజాసేవ మార్గంలో నడవడమే వారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

# మూడు దేశాల పర్యటనకు రాష్ట్రపతి

మెదటి పేజీ తరువాయి




ఏర్పడనున్నాయని అధికారులు తెలిపారు. రొమేనియాకు భారత రాష్ట్రపతి అధికారికంగా వెళ్లడం మూడు దశాబ్దాలకుపైగా విరామం తర్వాత జరుగుతోంది. ఈ పర్యటన రెండు దేశాల మధ్య ఉన్న సుదీర్ఘ స్నేహ సంబంధాలకు మరింత బలం చేకూర్చుతుందని భావిస్తున్నారు. పర్యటన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయా దేశాల అధ్యక్షులు, ప్రభుత్వ ప్రధానులు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరపనున్నారు. ద్వైపాక్షిక సహకారం, వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, సాంకేతికత తదితర రంగాల్లో భాగస్వామ్యాన్ని విస్తరించే అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. భారత్‌తో స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ పర్యటనలు కీలకంగా మారనున్నాయని విదేశాంగ వర్గాలు పేర్కొంటున్నాయి. అంతర్జాతీయ వేదికలపై పరస్పర సహకారం పెంపొందించుకోవడంతో పాటు ప్రజల మధ్య సంబంధాలను కూడా మరింత బలోపేతం చేయాలని ఇరు పక్షాలు భావిస్తున్నాయి. భారత విదేశాంగ విధానంలో యూరప్ దేశాలతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రపతి ఈ పర్యటనలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఈ పర్యటనలు భారత్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరింత బలమైన దౌత్య సంబంధాలను తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# జాతీయ చలనచిత్ర పురస్కార విజేతలకు చంద్రబాబు అభినందనలు

మెదటి పేజీ తరువాయి



నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు తమ అసాధారణ ప్రతిభతో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించారని చంద్రబాబు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో తెలుగు సినిమా ప్రతిష్ఠను మరింత పెంచిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. కళ, సంస్కృతి, సినిమా అనేవి సమాజ అస్తిత్వానికి, వారసత్వానికి బలమైన మూలస్తంభాలని ముఖ్యమంత్రి అన్నారు. తెలుగు సినిమా సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యంతో ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోందని, ఈ విజయ పరంపర భవిష్యత్తులో కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. జాతీయ చలనచిత్ర పురస్కారాలు అందుకున్న వారందరూ తమ ప్రతిభతో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చంద్రబాబు ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో తెలుగు చిత్ర పరిశ్రమ మరిన్ని విశిష్ట విజయాలు సాధించి భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తన సందేశంలో ప్రముఖ నటులు మమ్ముట్టి, యామీ గౌతమ్, కార్తీక్ ఆర్యన్, నిహారిక కొణిదెల, దర్శకుడు సుకుమార్‌లకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచిన వారందరికీ తన అభినందనలు తెలియజేస్తూ వారి భవిష్యత్ ప్రయాణం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అలాగే జాతీయ పురస్కారాల్లో గుర్తింపు పొందిన 'పుష్ప 2', 'కల్కి 2898 ఏడీ', 'లక్కీ భాస్కర్' వంటి చిత్రాల విజయాన్ని కూడా చంద్రబాబు అభినందించారు. తెలుగు సినిమా ప్రపంచ సినీ రంగంలో మరింత ఉన్నత స్థానాన్ని సంపాదించి భారతీయ సినీ పరిశ్రమకు గర్వకారణంగా నిలవాలని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు.

# అమెరికా చేరుకున్న మంత్రి సీతక్కకు ఘన స్వాగతం

మెదటి పేజీ తరువాయి



కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి, రాష్ట్ర ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో మరింత పెంచేందుకు ప్రవాస తెలంగాణవాసులు చేస్తున్న కృషి ఎంతో విలువైనదని మంత్రి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో వారి భాగస్వామ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు. టీటీఏ మహాసభలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు ప్రవాస తెలంగాణవాసుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని సీతక్క పేర్కొన్నారు. ఈ వేదిక ద్వారా పరస్పర సహకారం, అభివృద్ధిపై చర్చలు జరగనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో మంత్రి సీతక్క టీటీఏ మహాసభల్లో పాల్గొని ప్రవాస భారతీయులతో సమావేశం కానున్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, సామాజిక సేవా కార్యక్రమాలపై ప్రవాసులతో చర్చలు నిర్వహించనున్నట్లు సమాచారం.

# అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోవద్దు మహేష్ కుమార్ గౌడ్

మెదటి పేజీ తరువాయి



సారించి ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. బూత్ స్థాయిలో జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆగస్టు 3వ తేదీ వరకు నాయకులందరూ ఎస్ఐఆర్ ప్రక్రియపైనే పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాలని ఆయన తెలిపారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు పనులను వేగవంతం చేసి బూత్ స్థాయి ప్రతినిధులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో పార్టీ నాయకులు ఎంత అంకితభావంతో పనిచేస్తారో, అదే స్థాయిలో ఇప్పుడు కూడా ఎస్ఐఆర్ ప్రక్రియలో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు నాయకులు తమ నియోజకవర్గాల్లోనే ఉండి ప్రతి దశను పర్యవేక్షించాలని కోరారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా నష్టపోకుండా చూడటం ప్రతి నాయకుడి బాధ్యత అని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆస్ట్రేలియాలో భారత వైమానిక దళం విన్యాసాలు

మెదటి పేజీ తరువాయి



నిర్వహించే చర్యలను ఈ విన్యాసాల్లో అభ్యసిస్తాయి. అంతర్జాతీయ స్థాయిలో పరస్పర సహకారం, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఉత్తర ఆస్ట్రేలియాలో జనసంచారం తక్కువగా ఉండే విశాల ప్రాంతాల్లో రాత్రివేళల్లో విమాన విన్యాసాలు నిర్వహించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. అందుకే దీనికి 'పిచ్ బ్లాక్' అనే పేరు వచ్చింది. రాత్రి యుద్ధ విన్యాసాలు, వ్యూహాత్మక వైమానిక చర్యలు, సమన్వయ కార్యకలాపాలకు ఈ విన్యాసాలు వేదికగా నిలుస్తాయి. ఈ ఏడాది నిర్వహిస్తున్న పిచ్ బ్లాక్ విన్యాసాలు గత 45 ఏళ్ల చరిత్రలోనే అతిపెద్దవిగా నిలవనున్నాయి. అత్యధిక సంఖ్యలో దేశాల వైమానిక దళాలు, సైనిక సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. భారీ స్థాయిలో బహుళ దేశాల వైమానిక యుద్ధ విన్యాసాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వివిధ దేశాల మధ్య వ్యూహాత్మక సహకారాన్ని బలోపేతం చేయడంతో పాటు ఆధునిక యుద్ధ విధానాలపై అనుభవాన్ని పంచుకోవడానికి ఈ విన్యాసాలు దోహదపడనున్నాయి. సాంకేతిక నైపుణ్యాలు, కార్యాచరణ సామర్థ్యాలు, సమిష్టి ప్రతిస్పందనను మరింత మెరుగుపర్చేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. భారత వైమానిక దళం ఈ అంతర్జాతీయ విన్యాసాల్లో పాల్గొనడం ద్వారా ప్రపంచ స్థాయి వైమానిక దళాలతో కలిసి పనిచేసే అనుభవాన్ని మరింత విస్తరించుకోనుంది. అంతేకాకుండా ఆధునిక యుద్ధ వ్యూహాలు, సంయుక్త కార్యాచరణ పద్ధతులపై విలువైన అనుభవాన్ని సొంతం చేసుకుంటుందని రక్షణ వర్గాలు వెల్లడించాయి.

# కామారెడ్డి బీసీ డిక్లరేషన్ వాగ్దానాలను అమలు చేయాలి



చిలుకూరు (మన ప్రజాప్రతినిధి దినపత్రిక) బీసీ అభ్యున్నతికి పాటుపడతామని గత శాసనసభ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో నేటి ముఖ్యమంత్రి నాటి పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హామీలు ఇచ్చి మూడేళ్లు పూర్తి కావస్తుంది కానీ అమలకు నోచుకో పోవడం బాధాకరవని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు, అన్నారు బీసీ హక్కుల సాధన సమితి సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం రాంపురం గ్రామంలో జరిగిన మండల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ.... బీసీల అభివృద్ధి కొరకు 21 హామీలు ఇచ్చి ఉన్నారని ముఖ్యంగా స్థానిక సంస్థల్లో, విద్యలో, ఉద్యోగంలో, ఉపాధిలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి ఉన్నారని అట్టి హామీ అమలు కావాలంటే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తెలంగాణ శాసనసభ ఆమోదించిన బిల్లును షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చాల్సి ఉండగా బిజెపి ప్రభుత్వం అడ్డుకుంటుందని అందువల్ల అఖిలపక్షాలను ప్రధాని వద్దకు తీసుకెళ్లడంలో ముఖ్యమంత్రి చొరవ చేయకపోవడం బాధాకరమని వారు అన్నారు అలాగే ప్రతి మండల కేంద్రంలో 50 దుకాణాలతో కూడిన షాపింగ్ మాల్స్ నిర్మాణం చేసి రైతు బజార్ మాదిరిగా బీసీ బజార్లు ఏర్పాటు చేసి చేతివృత్తుల వారికి ఉచితంగా దుకాణాలు కేటాయిస్తామన్న వాగ్దానం కూడా అమలు కాలేదని బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం 20000 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి ఉన్నారని మొదటి సంవత్సరం కేవలం 9,200 కోట్లు మాత్రమే కేటాయించి అందులో కూడా రెండు వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తక్షణమే మూడు సంవత్సరాలకు సంబంధించి 60,000 కోట్ల రూపాయలు బీసీలకు బడ్జెట్ కేటాయించి బీసీ యువతకు స్వయం ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని,,రాజీవ్ వికాసం పేరుతో ఇంటర్వ్యూ నిర్వహించి ఆ పథకాన్ని అటకెక్కించారని ఆయన విమర్శించారు. బీసీలకు ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని అందుకు కావలసిన అన్ని రకాల ప్రయత్నాలు బలంగా చేసి కేంద్ర ప్రభుత్వపై ఒత్తిడి పెంచి కేంద్రం మెడలు వంచి బిసి బిల్లు షెడ్యూల్ తొమ్మిదిలో చర్చేందుకు ముఖ్యమంత్రి అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేయాలనిఆయన విజ్ఞప్తి చేశారు బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య గౌరవాధ్యక్షుడు చిలకరాజు శ్రీను, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఇనుగుర్తి వెంకటరమణాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు నిగిడాల వీరయ్య బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్ ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ సభ్యుడు పరికె భరత్ బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు బత్తని శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు

# రాజీలేని పోరాటాల ద్వారానే డంపింగ్ యార్డు తొలగింపు సాధ్యం



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :బాలాజీనగర్, శివాజీనగర్ లో బీఎస్పీ నేత బిర్రు యాకస్వామి అధ్యక్షతన, మరియు అహ్మద్ గూడ 2బి.హెచ్.కె. ఫేజ్-1 కన్వీనర్ విజయ్ కుమార్ అధ్యక్షతన డంపింగ్ యార్డు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ జరిగిన పాదయాత్రలు.ముఖ్య అతిథులుగా హాజరైన బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ రవీందర్ నాయక్, జిల్లా కార్యదర్శి సి.సంజీవ్ మరియు బి.ఎన్.ఆర్.కె.ఎస్. కామేళ్ళ అయిలయ్య..జవహర్ నగర్ రాంకీ డంపింగ్ యార్డు ఎత్తివేత పరిష్కారం కొరకు రాజీలేని ప్రజా పోరాటాల ద్వారానే సాధ్యమని ముఖ్య అతిథులుగా విచ్చేసిన బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ రవీందర్ నాయక్, జిల్లా కార్యదర్శి సి.సంజీవ్ మరియు బి.ఎన్.ఆర్.కె.ఎస్. కామేళ్ళ అయిలయ్య స్పష్టం చేశారు. 2026, జూలై-19, ఆదివారం రోజు జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి ఆధ్వర్యంలో 9 వ రోజు పాదయాత్రలు జరిగాయి. కీసర సర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలో గల బాలాజీనగర్, శివాజీనగర్ లో బీఎస్పీ నేత బిర్రు యాకస్వామి అధ్యక్షతన మరియు బండ్లగూడ, అహ్మద్ గూడ, 2బి.హెచ్.కె. ఫేజ్-1 పోరాట కమిటి కన్వీనర్ విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్, కో కన్వీనర్స్ సిపిఐ తోటపల్లి శంకర్, సిఎంఎస్ జయ, అల్లూరి సావిత్రి, పికెఎం డి.జాన్, డబుల్ బెడ్ రూమ్స్ షర్ఫుద్దీన్, సిపిఐ(ఎం.ఎల్)మాస్ లైన్ గడ్డం సదానందం, పిఓడబ్ల్యూ డి.స్వరూప, లక్ష్మీబాయి, కమిటీ కోశాధికారి, ఐ.ఎఫ్.టి.యు. పి శివబాబు, సిఎంఎస్ జయ, ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై మల్లేష్, బహుజనసత్త సింగరయ్య గౌడ్, పిఓడబ్ల్యూ జయసుధ, ఫాతిమా, జర్నలిస్ట్ కొన్నెవేణు, దర్శనం యాదగిరి, పిఓడబ్ల్యూ(విముక్తి) పెర్క సునీత, పిడిఎం చంద్రమౌళి, టివిఐవి మబ్బుబాలు, అహ్మద్ గూడ నిర్మల, వెంకటేష్, శ్రావణి, బీఎస్పీ సుక్క దయానంద్, సిహెచ్ అరుణ్ కుమార్, శ్రీహరి, ఎం.డి.జాఫర్, కొండా అప్పారావు, మల్లెపోగు విజయరాజు తదితరులు పాల్గొని, ముక్కు పుటాలను అదరగొట్టే దుర్వాసనలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. డంపింగ్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతిని, చెప్పుకోలేని రకరకాల చర్మవ్యాదులతో పాటు మహిళలు, బాలికలలో రక్తహీనత, క్యాన్సర్, కిడ్నీలు, శ్వాస కోశవ్యాదులు, మైగ్రేన్ లాంటి తలనొప్పులతో మానసిక, శారీరక సమస్యలతో తల్లడిల్లుతున్నారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను ఓటు బాంకు రాజకీయాలకు ఉపయోగించుకొని, వారి ఆరోగ్య భద్రతను, జీవన మనుగడను దెబ్బతీస్తున్న రాంకీ చెత్త డంపింగ్ ఎత్తివేతలో చూపిస్తున్న నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఎండగట్టారు. ఇప్పటికైన జవహర్ నగర్ డంపింగ్ యార్డును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ, 26 న పర్యావరణ పరిరక్షణ, డంపింగ్ యార్డు సమస్యపై జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

# అంత్యక్రియలో పాల్గొన్న ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మహమ్మద్ రఫీ



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూన్ 19 : చేగుంట మండలం అనంత సాగర్ గ్రామనికి చెందిన ఉప సర్పంచ్ చిక్కుడు స్వామి వాళ్ళ తండ్రి శనివారం రాత్రి అకస్మాత్తుగా మరణించారు, విషయం తెలుసుకున్న చేగుంట ఉపసర్పంచ్, మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మహమ్మద్ రఫీ ఆదివారం అనంతసాగర్ లోని వారి స్వగృహానికి చేరుకుని భౌతిక కాయానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు,. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు, నాయకులు,గ్రామస్తులు, బంధువులు సబ్బని శ్రావణ్ కుమార్, చిక్కుడు మహేష్, పలువురు పాల్గొన్నారు.

# భవసార క్షత్రియ సమాజ్ అధ్యక్షునిగా చంద్రశేఖర్ వాదోనే ఎన్నిక



సదాశివపేట మండల్//(మన ప్రజా ప్రతినిధి ):సదాశివపేట లో హాట్కరిపేట లోని శ్రీ భవాని భవ సార్ క్షత్రియ సమాధి అధ్యక్షునిగా చంద్రశేఖర్ వాదోని ఎన్నిక కావడం జరిగింది. ఆదివారం నాడు ఆలయ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించుకొని అందరి సభ్యుల కోరిక మేరకు పాత కార్యవర్గాన్ని రెండోసారి కొనసాగించుటకు ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు చంద్రశేఖర్ వాదోనే మాట్లాడుతూ తనపై నమ్మకం ఏర్పరచుకొని కమిటీ సభ్యులందరూ తనను రెండవసారి ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆలయ అభివృద్ధి మేరకు కృషి చేస్తానన్నారు.ఆలయ కమిటీ సభ్యులు గౌరవ అధ్యక్షులుగా రమేష్ గణాతే, కార్యదర్శి అర్జున్ రావు దాండిగే, ఉపాధ్యక్షులు త్రియంబర్ లెండాలే, దయానంద్ దుమాలే, నరేందర్ దాండిగే, సంజీవ్ మహేందర్కర్, సంయుక్త కార్యదర్శులు రాజు పతంగే, శ్రీనివాస్ మహేందర్, కార్యనిర్వాకులు తులసీదాస్ మహేందర్కర్, మాణిక్ రావు లేండాలే, కోశాధికారి రవీందర్ దుమాలే, ముఖ్య సలహాదారులు తులసీదాస్ మహేందర్కర్, పాండు మహేందర్కర్, కృష్ణ గణాతే, సత్యనారాయణ లేండాలే, కార్యవర్గ సభ్యులు అమర్నాథ్ దుమాలే, ఈశ్వర్ దౌలాగర్, రవి పెన్స్కర్, నాగేశ్వరరావు గర్నే, రాజు మహేందర్కర్, దయానంద్ దేవులే, మాణిక్ మహేందర్, ప్రకాష్ మహేందర్కర్, ప్రకాష్ రావు దాండిగే, సురేష్ మహేందర్కర్, హరికృష్ణ కలేకర్, నర్సింగ్ ఓంకారే, అభినయ్ దౌలాగర్, తులసి దాస్ దాండిగే, మల్లేశ్వర్ మహేందర్కర్, ఉమేష్ హిర్వే, అనిల్ మహేందర్కర్, నాగేష్ దౌలాగర్, కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.

# గదిలో విద్యార్థి మృతదేహం....మూడు రోజుల తర్వాత వెలుగులోకి ఘటన

-దుర్వాసనతో బయటపడిన విషయం
-ఉరివేసుకున్నట్లు అనుమానం
-మొబైల్ ఫోన్ స్వాధీనం



బెంగళూరు, జూలై 19 (మనప్రజాప్రతినిధి): కర్ణాటక రాజధాని బెంగళూరులో ఓ పారామెడికల్ విద్యార్థి ఇంట్లోని గదిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడు రోజులుగా గది తలుపులు తెరవకపోవడంతో పాటు ఇంటి నుంచి దుర్వాసన రావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, గదిలో ఉరికి వేలాడుతున్న యువకుడి మృతదేహాన్ని గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం మారప్పనపాళ్యకు చెందిన 20 ఏళ్ల ఉదయ్ గౌడ పారామెడికల్ కోర్సు చదువుతున్నాడు. కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో తన గదిలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందినట్లు తెలుస్తోంది. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గది తలుపులు తెరిచి పరిశీలించగా, విద్యార్థి మృతదేహం సీలింగ్‌కు వేలాడుతూ కనిపించింది.మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో సుమారు మూడు రోజుల క్రితమే మరణించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఘటనకు గల కారణాలను తెలుసుకునేందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విద్యార్థి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని అందులోని వివరాలను పరిశీలిస్తున్నారు. మృతుడి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం ఉదయ్ ప్రతిరోజూ ఉదయం కళాశాలకు వెళ్లి రాత్రి ఇంటికి వచ్చేవాడని చెప్పారు. అయితే తనకు అనారోగ్య సమస్యలు ఉండటంతో నాలుగు రోజులుగా ఇంటికి దూరంగా ఉన్న సమయంలోనే ఈ ఘటన జరిగినట్లు వెల్లడించారు.ఇటీవల ఉదయ్ తిరుపతికి వెళ్లి వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే అతడు ఆత్మహత్యకు పాల్పడే పరిస్థితులు ఏమిటన్నది తమకు అర్థం కావడం లేదని తండ్రి పోలీసులకు చెప్పారు. కుటుంబ సభ్యుల వాంగ్మూలాలతో పాటు ఇతర కోణాల్లో కూడా దర్యాప్తు కొనసాగుతోంది. పోస్టుమార్టం నివేదిక, సాంకేతిక ఆధారాలు, కుటుంబ సభ్యులు, స్నేహితుల వాంగ్మూలాల ఆధారంగా మృతికి గల అసలు కారణాలను పోలీసులు వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు మృతిపై ఎలాంటి నిర్ధారణకు రావద్దని పోలీసులు తెలిపారు.

# గౌడ జన హక్కుల పోరాట సమితి 'మోకుదెబ్బ' రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా చేరపెల్లి పరశురాములు గౌడ్ నియామకం



మనప్రజాప్రతినిది//రాజన్నసిరిసిల్ల:తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గౌడ కులస్థుల, గీత కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న గౌడ జన హక్కుల పోరాట సమితి 'మోకుదెబ్బ', తమ నూతన కార్యవర్గాన్ని విస్తరించింది. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా, చిన్న బోనాల గ్రామానికి చెందిన శ్రీ చేరపెల్లి పరశురాములు గౌడ్ (తండ్రి: మల్లయ్య గౌడ్) గారిని రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ సంఘం రాష్ట్ర కమిటీ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకం 19/07/2026 నుండి మూడేళ్ల పాటు అమలులో ఉంటుందని రాష్ట్ర కమిటీ ప్రకటించింది.ఈ పదవికి పూర్తి న్యాయం చేస్తా చేరపెల్లి పరశురాములు గౌడ్ఈ సందర్భంగా నూతనంగా జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన చేరపెల్లి పరశురాములు గౌడ్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షుల వారికి మరియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన చేస్తూ, "నన్ను నమ్మి ఈ జిల్లా అధ్యక్ష పదవిని అప్పగించినందుకు రాష్ట్ర నాయకత్వానికి రుణపడి ఉంటాను. నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, రాత్రింబగళ్లు శ్రమించి ఈ పదవికి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తాను. జిల్లాలోని ప్రతి ఒక్క గీత కార్మికుడికి, గౌడ సోదరుడికి సంఘం అండగా ఉండేలా ముందుకు నడిపిస్తాను" అని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు.సేవా స్ఫూర్తికి గుర్తింపుగత కొన్ని సంవత్సరాలుగా గీత కార్మికుల, గౌడ కులస్థుల సమస్యల పరిష్కారం కొరకు పరశురాములు గౌడ్ అలుపెరగని పోరాటం చేస్తున్నారు. ఆయన చేసిన సేవలను, పోరాట స్ఫూర్తిని గుర్తించిన మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ, ఈ బాధ్యతలను అప్పగించినట్లు స్పష్టం చేసింది.హక్కుల సాధనే లక్ష్యంగా..ఈ నియామకం సందర్భంగా సంఘ నిబంధనల ప్రకారం క్రమశిక్షణతో పనిచేస్తూ, కింది లక్ష్యాల కోసం కృషి చేయాలని రాష్ట్ర కమిటీ ఆకాంక్షించిందిగౌడ గీత కార్మికుల హక్కుల రక్షణ కోసం నిరంతరం పోరాడటం. రాష్ట్రంలోని గౌడ కులస్థులకు ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్య, ఉద్యోగ రంగాల్లో జనాభా నిష్పత్తి (ధమాషా) ప్రకారం దక్కాల్సిన వాటా కోసం నిస్వార్థంగా పనిచేయడం. రాష్ట్రంలోని గౌడ సామాజిక వర్గాన్ని ఏకం చేసి హక్కుల సాధన దిశగా ముందుకు తీసుకెళ్లడం.ఈ నియామక పత్రంపై గౌడ జన హక్కుల పోరాట సమితి 'మోకుదెబ్బ' రాష్ట్ర అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ (బి.ఎ) మరియు రాష్ట్ర సెక్రటరీ జనరల్ రాగుల సిద్ది రాములు గౌడ్ సంతకాలు చేశారు. పరశురాములు గౌడ్ నియామకం పట్ల జిల్లాలోని గౌడ సంఘాల నాయకులు మరియు గీత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## అంతరిక్ష యవనికపై సిరిసిల్ల యువతేజాలు!!విక్రమ్ 1,విజయకేతనంలో ఒకే కుటుంబానికి చెందిన



ముగ్గురు ఇంజనీర్లులి మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్లజూలై ,19:అంతర్జాతీయ అంతరిక్ష రంగ యవనికపై సిరిసిల్ల యువతేజాలు తళుక్కున మెరిశాయి. భారత అంతరిక్ష ప్రయోగాల చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ, శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుండి శనివారం విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిన 'విక్రమ్-1' ఆర్బిటాల్ వాహక నౌక ప్రయోగంలో సిరిసిల్లకు చెందిన ముగ్గురు ఇంజనీర్లు భాగస్వాములు కావడం విశేషం. దేశం గర్వించదగ్గ ఈ చారిత్రాత్మక విజయ సాధనలో పాల్గొన్న ఆ ముగ్గురు ఇంజనీర్లు ఒకే గ్రామానికి, అదీ ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం సిరిసిల్ల ప్రాంత ప్రజలకు తీరని గర్వకారణంగా నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ అంతరిక్ష సంస్థ "స్కైరూట్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్" రూపొందించిన ఈ తొలి ఆర్బిటల్ ప్రయోగ వాహకం.. తన మొదటి ప్రయత్నంలోనే ఉపగ్రహాలను దిగువ భూ కక్ష్య ( ఎల్ఈఓ) లో విజయవంతంగా ప్రవేశపెట్టి చరిత్ర సృష్టించింది. ప్రైవేటు రంగంలో భారత్ సాధించిన ఈ అద్భుత విజయ వెనుక సిరిసిల్ల పట్టణానికి చెందిన అడుప సంతోష్ కుమార్, అడుప కిరణ్ అనే సోదరులతో పాటు వారి బంధువు బొమ్మదేని నాగరాజు కీలక పాత్రలు పోషించారు.రాకెట్ ప్రయోగంలో యువ ఇంజనీర్ల పాత్రలుఅడుప సంతోష్ కుమార్ రాకెట్‌కు సంబంధించిన అవియానిక్స్ వ్యవస్థల తనిఖీలు, పరీక్షలతో పాటు, ప్రయోగానికి ముందు అత్యంత కీలకమైన 'గ్రౌండ్ చెక్ అవుట్' కార్యకలాపాలకు వీరు నాయకత్వం వహించారు.అడుప కిరణ్ (రాకెట్ క్యాడ్ డిజైనర్):విక్రమ్-1 రాకెట్ రూపకల్పనకు సంబంధించిన అత్యంత సంక్లిష్టమైన డిజైన్ పనుల్లో వీరు కీలక పాత్ర పోషించారు.బొమ్మదేని నాగరాజు (ఎలక్ట్రికల్ ఇంటిగ్రేషన్):రాకెట్‌లోని విద్యుత్ వ్యవస్థల సమీకరణ (ఇంటిగ్రేషన్) పనులను విజయవంతంగా నిర్వహించి ప్రయోగ విజయానికి తోడ్పడ్డారు.సిరిసిల్ల ఖ్యాతి దశదిశలా..ప్రపంచ దేశాల ముందర భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం తన సత్తా చాటిన ఈ అపూర్వ విజయ గాథలో.. తమ ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు భాగస్వాములు కావడంపై సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే కుటుంబం నుండి ముగ్గురు యువ ఇంజనీర్లు అంతరిక్ష రంగానికి సేవలందించి, సిరిసిల్ల ఖ్యాతిని దశదిశలా చాటడం స్థానిక యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా ఆ ముగ్గురు యువ ఇంజనీర్లకు, వారి కుటుంబ సభ్యులకు సిరిసిల్ల ప్రజలు, ప్రముఖులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## వైద్యులు సామాజిక బాధ్యతతో పేద ప్రజలకు సేవ చేయడం సంతోషకరం వేల్జిపురం గ్రామ సర్పంచ్ నాయిని నవీన్ కుమార్




మన ప్రజాప్రతినిధి/ మనకొండూరు తేదీ 19 జూలై :ఇల్లంతకుంట మండలం వెల్జీపురం గ్రామంలో వంశీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పాలకవర్గం సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది.వైద్యులు డా. నేరెళ్ల వంశీధర్ గౌడ్ (ఎండి) డా. చేపూరి కపిల్ సాయి గౌడ్ (ఈ ఎన్ టి) గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ మాట్లాడుతూఉన్నత విద్యను అభ్యసించిన వైద్యులు తమ సామాజిక బాధ్యతగా మారుమూల ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు, బీపీ & షుగర్ పరీక్షలు నిర్వహించి, మందులు అందించడం అభినందనీయమని తెలిపారు. ఈ శిబిరంలో 300 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.ఈ మెగా వైద్య శిబిరాన్ని వెల్జీపురంలో నిర్వహించిన వంశీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కంకణాల శ్రావణి నరేష్ రెడ్డి,మాజీ సర్పంచులు గుండ వెంకటేశం గౌడ్ , ఓం సాయి రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండ సరోజన ముత్తయ్య గౌడ్, వార్డు సభ్యులు బొజ్జ శ్రీనివాస్, దేశెట్టి కవిత బాబు చందర్, వేములవాడ భారతి రాజేశం, చిలువేరి సంతోష్ రెడ్డి, బొల్లారం ప్రసన్నకుమార్, ఓరెం రూప భార్గవ్ రెడ్డి,యువజన సంఘ సభ్యులు వేములవాడ శివకుమార్, వంగపల్లి నవీన్ రెడ్డి, సుధగోని నవీన్ గౌడ్, వేములవాడ రమణాచారి, ఓరెం నిఖిల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర సృష్టించిన పీవీ సింధు...

### -జపాన్ ఓపెన్ గెలిచిన తొలి భారత మహిళ
### -ప్రపంచ వేదికపై మరోసారి భారత కీర్తి పతాకం
### -దేశవ్యాప్తంగా అభినందనల వెల్లువ



హైదరాబాద్, జూలై 19 (మనప్రజాప్రతినిధి): భారత స్టార్ షట్లర్ పీవీ సింధు మరోసారి చరిత్ర సృష్టించింది. ప్రతిష్ఠాత్మక జపాన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుని ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళగా రికార్డు నెలకొల్పింది. ఎన్నో ఏళ్లుగా ప్రపంచ బ్యాడ్మింటన్‌లో అగ్రశ్రేణి క్రీడాకారిణిగా కొనసాగుతున్న సింధు, మరో అరుదైన విజయాన్ని తన ఖాతాలో వేసుకుని భారత క్రీడా చరిత్రలో మరో స్వర్ణాధ్యాయాన్ని లిఖించింది. ఆమె విజయంతో దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తుండగా, రాజకీయ, క్రీడా, సామాజిక రంగాలకు చెందిన ప్రముఖులు అభినందనలతో ముంచెత్తుతున్నారు. భారత జెండాను మరోసారి అంతర్జాతీయ వేదికపై రెపరెపలాడించిన సింధు విజయాన్ని దేశం గర్వంగా స్వాగతిస్తోంది. జపాన్ ఓపెన్ ప్రపంచ బ్యాడ్మింటన్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ టోర్నీలో విజేతగా నిలవడం ప్రతి క్రీడాకారుడి కలగా భావిస్తారు. అలాంటి పోటీలో అత్యుత్తమ ప్రదర్శనతో టైటిల్‌ను సొంతం చేసుకున్న సింధు భారత మహిళా బ్యాడ్మింటన్‌కు కొత్త గుర్తింపును తీసుకొచ్చింది. ఇప్పటివరకు ఏ భారత మహిళా షట్లర్‌కు సాధ్యం కాని ఘనతను అందుకోవడం ద్వారా ఆమె తన ప్రత్యేకతను మరోసారి నిరూపించింది. అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడిని అధిగమిస్తూ నిలకడగా రాణించడం సింధు గొప్పతనానికి నిదర్శనమని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఒలింపిక్స్ పతకాలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్ స్వర్ణం, కామన్వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడలు, అంతర్జాతీయ టోర్నీల్లో అనేక విజయాలతో ఇప్పటికే భారత క్రీడా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన సింధు, ఇప్పుడు జపాన్ ఓపెన్



టైటిల్‌ను కూడా తన విజయాల జాబితాలో చేర్చుకుంది. ప్రతి విజయంతో కొత్త లక్ష్యాలను నిర్దేశించుకుంటూ ముందుకు సాగుతున్న ఆమె యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. క్రమశిక్షణ, కఠోర సాధన, ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే ప్రపంచ వేదికపై అత్యున్నత విజయాలు సాధించవచ్చని సింధు తన ప్రస్థానంతో నిరూపించింది. భారత బ్యాడ్మింటన్‌కు ప్రపంచవ్యాప్తంగా మరింత గౌరవాన్ని తీసుకురావడంలో ఆమె పాత్ర విశేషమని క్రీడా నిపుణులు పేర్కొంటున్నారు. సింధు విజయంపై దేశవ్యాప్తంగా అభినందనల వెల్లువ కొనసాగుతోంది. రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, రాజకీయ ప్రముఖులు, క్రీడా సంఘాల ప్రతినిధులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. భారత క్రీడా రంగానికి మరో అపూర్వ విజయాన్ని అందించినందుకు ఆమెను కొనియాడారు. అంతర్జాతీయ స్థాయిలో భారత మహిళల ప్రతిభను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిన ఈ విజయం దేశ యువతకు స్ఫూర్తినిస్తుందని అభిప్రాయపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో కూడా సింధు విజయంపై లక్షలాది మంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు.భారతదేశంలో బ్యాడ్మింటన్ క్రీడ అభివృద్ధికి సింధు విజయాలు విశేషంగా దోహదపడుతున్నాయి. ఆమె విజయాలను చూసి అనేక మంది యువత ఈ క్రీడ వైపు ఆకర్షితులవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో సాధన చేస్తున్న యువ క్రీడాకారులకు ఆమె ప్రస్థానం మార్గదర్శకంగా నిలుస్తోంది. దేశంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, శాస్త్రీయ శిక్షణ, అంతర్జాతీయ ప్రమాణాల కోచింగ్ అందుబాటులోకి రావడంతో భారత క్రీడాకారులు ప్రపంచస్థాయిలో మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. సింధు తాజా విజయం భారత బ్యాడ్మింటన్‌కు మరింత ఉత్సాహాన్ని అందించనుంది. పీవీ సింధు సాధించిన ఈ చారిత్రాత్మక విజయం భారత క్రీడా చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోనుంది. ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠను మరింత పెంచుతూ వరుస విజయాలతో దూసుకెళ్తున్న ఆమెపై దేశ ప్రజల ఆశలు మరింత పెరిగాయి. రానున్న అంతర్జాతీయ టోర్నీలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లు, ఇతర ప్రతిష్ఠాత్మక పోటీల్లో కూడా ఇదే విజయపరంపర కొనసాగించాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు. దేశానికి మరిన్ని స్వర్ణ క్షణాలను అందిస్తూ భారత జెండాను ప్రపంచవ్యాప్తంగా మరింత ఎత్తులో ఎగురవేయాలని ప్రతి భారతీయుడు కోరుకుంటున్నాడు.

# మన వార్డు మన బాధ్యత కార్యక్రమం




మనప్రజాప్రతినిధి కొండపాక మండల్: ఆదివారం రోజు వినూత్నంగా "మన వార్డ్ మన బాధ్యత" అనే కాన్సెప్ట్ తో స్థానిక వార్డ్ మెంబెర్ యాదగిరి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. కొండపాక గ్రామ పంచాయితీ పాలకవర్గంలో కొనసాగుతున్న స్థానిక పరిపాలనను ప్రజలకు మరింత సులభంగా,వేగంగా ప్రజలకు అందించేందుకు గాను మొదటి వార్డ్ మెంబెర్ యాదగిరి సరికొత్త ఆలోచనతో తొలిసారిగా వార్డ్ సభ నిర్వహించినట్టు తెలిసింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ , గ్రామపంచాయతీ కార్యదర్శి తో పాటు పాలక మండలి, ఆరోగ్య శాఖ వర్కర్ విపివో, వార్డ్ ప్రజలు హాజరు అయ్యారు.ఈ సందర్బంగా గ్రామ సర్పంచ్,వార్డ్ మెంబర్ యాదగిరి మాట్లాడుతూ,గత 7 నెలల్లో మరుగునపడిన డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేయించామని, మిషన్ భగీరథ ద్వారా నీరు అందని 10 కుటుంబాలకు నీటి సరఫరా కల్పించామని తెలిపారు.అవసరాలకు అనుగుణంగా ఇంకా కొన్ని ముఖ్యమైన పనులు చేయడానికి కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు.

